

పసుపు.. దిగుబడి బాగు
వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఈ ఏడాది పసుపు దిగుబడి ఆశాజనకంగా ఉన్నందున రైతుల్లో ఆనందం నెలకొంది. 8లో



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన
విశాఖ నగరంలోని మధురవాడ శిల్పారామం జాతరలో ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. 8లో



విశేషంగా ఆర్జిత సేవలు
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు, స్వర్ణ పుష్పార్చన విశేషంగా జరిగాయి. 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీకి లోయర్ సీలేరు జట్టు



లోయర్ సీలేరు జట్టు

మోతుగూడెం: రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగే ఏపీ ఎలక్ట్రిసిటీ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో లోయర్ సీలేరు జట్టు పాల్గొంటున్నట్టు లోయర్ సీలేరు స్పోర్ట్స్ సెక్రటరి సతీష్‌కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌తో పాటు వివిధ స్టేషన్ల నుంచి సుమారు 32 టీములు పాల్గొంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. విజయం సాధించాలని లోయర్ సీలేరు జట్టును స్థానిక చీఫ్ ఇంజనీర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ బి.శ్రీధర్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బాలకృష్ణ ఇతర జెన్‌కో ఉన్నతాధికారులు జట్టు సభ్యులను కోరారు.

33 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం
- నలుగురి అరెస్టు



నిందితులతో పోలీసులు

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 33 కిలోల లిక్విడ్ గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జీపు స్టాండ్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా జీపు, కారులో 33 కిలోల లిక్విడ్ గంజాయిని గుర్తించామన్నారు. వాహనాల్లోని స్పీకర్ బాక్సుల్లో ఉంచి మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో అనకాపల్లి జిల్లా వడ్డాది గ్రామానికి చెందిన సురేష్, వెంకటేష్, కేరళ రాష్ట్రానికి చెందిన సినేష్ జోసెఫ్‌ను అరెస్ట చేసినట్టు ఆయన పేర్కొన్నారు. నిందితుల నుంచి లిక్విడ్ గంజాయి, కారు, జీపు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం
- భూపతిపాలెం జలాశయంలో గుర్తించిన స్థానికులు
- హత్య.. ఆత్మహత్య.. కోణంలో పోలీసుల దర్యాప్తు



మహిళ మృతదేహం

రంపచోడవరం: భూపతిపాలెం జలాశయంలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. మహిళ మృతదేహం నీటిపై తేలి ఉందని స్థానికుల సమాచారం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టమ్ నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ పంజాబీ డ్రస్ వేసుకున్నట్లు తెలిపారు. చేతికి వాచీ, ఉంగరం ఉందన్నారు. మృతదేహం ఉబ్బిపోయి ముఖం గుర్తుపట్టలేని విధంగా మారిందని తెలిపారు. అయితే ఆమెకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆమెను ఎవరైనా హత్య చేసి జలాశయంలో పడేశారా.. ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గిరి రైతు ఆత్మహత్య
- నల్లకుంటలో విషాదం



కామేశ్వరరావు (ఫైల్)

ఎటపాక: కుటుంబ కలహాల నేపథ్యంలో గిరిజన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చోడవరం పంచాయతీలోని చిననల్లకుంట గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ పార్థసారథి వివరాలిలా ఉన్నాయి. చిననల్లకుంటలో సుమారు ఆరు ఎకరాల్లో గొంది కామేశ్వరరావు (30) అనే రైతు వరి, మిర్చి, పత్తిని సాగు చేసేవాడు. అయితే ఈ ఏడాది పంటలు పాడవటంతో తీవ్రంగా నష్టపోయాడు. చేసిన అప్పులు తీర్చే దారిలేక భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం రాత్రి కామేశ్వరరావు పురుగు మందు తాగి పడుకున్నాడు. తెల్లవారిన తరువాత కుటుంబసభ్యులు చూసేసరికి విగతజీవిగా ఉండటంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

మంచు మనోహరం



రాజవొమ్మంగి: ఎటుచూసినా పచ్చదనంతో నిండిఉండే ఈ ప్రాంతం ఒక్కసారిగా మంచు తెరలతో నలుపు తెలుపు వర్ణంలోని కాన్వాసులా మారిపోయింది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల వరకు ఈ అందాలు కనువిందు చేశాయి. వట్టిగెడ్డ జలాశయం వద్ద మంచు అందాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు సెల్‌ఫోన్లలో పదిలపరచుకున్నారు.

మురిసిన పర్యాటకం



వీఆర్‌పురం: పర్యాటకులు భారీగా తరలిరావడంతో పాపికొండలు మురిసిపోయాయి. ఆదివారం సెలవు కావడంతో పోచవరం బోట్ పాయింట్ సందర్శకులతో సందడిగా మారింది. ఈ ప్రాంతం నుంచి సుమారు 14 బోట్లలో 800 మంది విహారానికి వెళ్లినట్టు ఏపీ టూరిజం సిబ్బంది సీహెచ్.రాజేష్ తెలిపారు. అధిక సంఖ్యలో పర్యాటకులు పేరంటాలపల్లి శివాలయాన్ని దర్శించుకున్నారు.

అడవిలో ఆహ్లాదం

ఒకప్పుడు ఆ ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయం.. ఎటుచూసినా పిచ్చిమొక్కలు.. కనీసం కాలుపెట్టలేని దుస్థితి.. ఇప్పుడు సందర్శకులతో కళకళ. అటవీశాఖ రూ.లక్షలు వెచ్చించి ఆ ప్రదేశాలను పర్యాటకులకు మరుపురాని అనుభూతినిచ్చేలా తీర్చిదిద్దింది. ఒక పక్క అటవీ ఆస్తులను సంరక్షిస్తూ.. మరోపక్క సందర్శకులకు ఆహ్లాదం మిగులుస్తోంది.

- ఎకో టూరిజంపై దృష్టి పెట్టిన అటవీశాఖ
- అంజోడ సిల్క్‌ఫాం పైన్ వనాల్లో 'అరకు పైనరీ'
- వెడ్డింగ్ షూట్స్‌కు అనువుగా ఆకృతులు
- అరకు, చిలకలగెడ్డలో ఆకట్టుకుంటున్న పార్కులు



అంజోడ పైనరీ ఎకో పార్కు ముఖద్వారం వద్ద పర్యాటకుల సందడి

అనంతగిరి: మన్యం పాడేరు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావడంతో పర్యాటక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉండే ప్రాంతాలను అటవీశాఖ పర్యాటకులను ఆకట్టుకునేలా అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తోంది. సందర్శకుల రాక పెరగడంతో ఆదాయం కూడా మెరుగుపడుతోంది.

పైన్ వనాల్లో..

ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకు నుంచి జైపూర్ వెళ్లే మార్గంలో అంజోడా సిల్క్‌ఫాం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. సెలవు వచ్చిందంటే చాలు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఫాంలో 1972లో పైన్ మొక్కలను అటవీశాఖ నాటింది. వీటితో నీలగిరి మొక్కలు పెంచింది. ఇవన్నీ వనాలుగా మారడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో సుమారు రూ.70 లక్షలతో పార్కును అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. దీనికి అరకు పైనరీగా నామకరణం చేసింది. ఇక్కడ వనాల మధ్య నిర్మించిన హట్స్ సందర్శకులను ఎంతగానే ఆకట్టుకుంటున్నాయి. ప్రీ వెడ్డింగ్ షూట్స్‌తో నిత్యం సందడిగా ఉంటోంది. వ్యూపాయింట్, ముఖ ద్వారం, విద్యుత్ దీప కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

రూ.20 లక్షల ఆదాయం..

అంజోడా సిల్క్‌ఫాంలో గతేడాది నవంబర్ 19న అరకు పైనరీని ఏర్పాటుచేశారు. ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే పర్యాటకంగా విశేష గుర్తింపు పొందింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 37వేల మంది అరకు పైనరీని సందర్శించారు. సుమారు రూ.20 లక్షల మేర అటవీశాఖకు ఆదాయం లభించింది. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.25 చొప్పున టికెట్ ధరను అటవీశాఖ నిర్ణయించింది.

ఆకట్టుకుంటున్న ఎకో పార్కు

పర్యాటక కేంద్రమైన అరకువేలి అటవీశాఖ కార్యాలయం వద్ద ఉన్న ప్రదేశాన్ని ఎకో పార్కు పేరుతో అభివృద్ధి చేశారు. ఆహ్లాదం కలిగించే వాతావరణంలో బస చేసేలా ఎకో క్యాంపు షూట్స్, టెంట్స్, చిల్డన్ పార్కును అటవీశాఖ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. పర్యాటకుల నుంచి మూడు నెలల్లో సుమారు రూ.2 లక్షల మేర ఆదాయం లభించింది.

ప్రత్యేక ఆకర్షణగా చిలకలగెడ్డ ఎకో పార్కు

చిలకలగెడ్డ వద్ద చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఎకో పార్కు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడ అరకు కాఫీ హౌస్ ఏర్పాటు చేశారు. పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పూలమొక్కలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.



అంజోడలో చెట్ల మధ్య వ్యూపాయింట్



విద్యుతుకాంతులతో అరకు పైనరి

ఉన్నతాధికారుల సహకారంతో అభివృద్ధి



అటవీశాఖ ఉన్నతాధికారులు సహకారంతో అడవులను సంరక్షించడంతోపాటు పర్యాటకులకు ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే అంజోడ పైనరీ, ఎకో పార్కు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతాలను సందర్శించిన వారు ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు.

– శ్రీనివాస్, రేంజర్, అటవీశాఖ, అరకులోయ

అక్కచెల్లెమ్మలకు మేలు చేసిన జగనన్న



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సమన్వయకర్త రేగం మత్స్యలింగం

- మళ్లీ ఆయననే సీఎం చేయాలి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- ఆసరా చెక్కు పంపిణీ



అనంతగిరిలో ఆసరా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన డ్వాక్రా సంఘాల సభ్యులు

అనంతగిరి: ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మలకు రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో మేలు చేశారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక వెలుగు కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు చేసిన జగనన్నను డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు మళ్లీ సీఎంను చేసి రుణం తీర్చుకోవాలన్నారు. మన అభ్యున్నతికి కోసం జగనన్న బటన్ నొక్కారని, ఆయనను మళ్లీ సీఎం చేసేందుకు మనమంతా రెండు బటన్లను నొక్కేందుకు సిద్ధంగా ఉండలాని పిలుపునిచ్చారు. ఆయన 511 స్వయం సంఘాలకు సంబంధించి 5610 మంది మహిళలకు రూ. 2.66 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి థింసా నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం, ఎంపీపీ శెట్టినీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్‌లు రూతు, సింహాద్రి, ఏసీ కృష్ణారావు, ఏపీఎం శ్రీరాములు, సీసీలు ఆనంద్, త్రినాథ్, నారాయణ, వీవోఏలు దిలీప్, రంజిత, శిరీషా, రత్న పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం

అరకులోయ టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని అరకులోయ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం అరకులోయలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం వెలుగు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగనన్న తన పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారన్నారు. ఆసరా కింద జిల్లాలోని అక్క చెల్లెమ్మలకు రూ. గత నాలుగేళ్లగా 133 కోట్ల 65 లక్షలు అందించారన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలు వంట గదికే పరిమితం కాకుండా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగేలా సీఎం ప్రోత్సహిస్తున్నారన్నారు. అందుకే మహిళలంతా మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రెండోసారి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకర్గ సమన్వయకర్త, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం మాట్లాడుతూ మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలన్నారు. డ్వాక్రా మహిళలకు 1.46 కోట్ల విలువైన ఆసరా చెక్కును అందజేశారు. డ్వాక్రా మహిళలు కేక్ కట్ చేసి, సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. థాంక్యూ సీఎం సార్ నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. వెలుగు స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామరాజు, ఏసీ కృష్ణారావు, ఏపీఎంలు అప్పయ్యమ్మ, ప్రసాద్, సీసీ మోష్యా కామరాజు ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచ్‌లు సుస్మిత, బొజ్జ, బుటికి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.





అరకులో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, పాల్గొన్న డ్వాక్రా మహిళలు

పీఏసీఎస్ ఛైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

కొన్ని చోట్ల మార్పులు, చేర్పులు

విశాఖ విద్య: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్/ఎఫ్ఎస్‌సీఎస్/ ఎల్ఎస్‌సీఎస్) పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కార్యకలాపాలను కొనసాగించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులకు సమాచారం అందింది. డీసీసీబీ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 98 పీఏసీసీలకు ఇప్పటి వరకు పనిచేస్తున్న పాలక మండళ్ల ఈ ఏడాది జులై 30 వరకు లేదా వీటికి ఎన్నికలు నిర్వహించేంత వరకు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కొన్ని చోట్ల నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఛైర్‌పర్సన్, సభ్యులను మార్పు చేశారు. ఇలా అనకాపల్లి జిల్లా శ్రీ గౌరి సొసైటీ, మేడివాడ , అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, పాడేరు. జి. మాడుగుల, చింతపల్లి, జి.కే.వీధి సొసైటీ పాలక మండళ్లలో చేర్పులు, మార్పులు చేశారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాల సొసైటీకి మాత్రం ముగ్గురు సభ్యులుగా బదులుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీవీ సత్యకుమార్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు,ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్. వర్మ తెలిపారు.

పాడేరు : అనంతగిరి మండలంలో గతంలో ఉన్న కొర్రా చిన్నయ్యను పీఏసీఎస్ ఛైర్మన్‌గా సభ్యులుగా జన్ని సుబ్బారావు, బోయిన ఆనందరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాడేరు మండలంలో గతంలో పనిచేసిన తమర్బ వెంకటేశ్వర్లు స్థానంలో లకే రామసత్యవతిని ఛైర్‌పర్సన్‌గా, సభ్యులుగా మినుముల అప్పారావు పాత్రుడు, పలాసి రామారావు నియమితులయ్యారు. జి.మాడుగుల మండలంలో గతంలో ఉన్న సుర్మని మత్స్యకొండనాయుడును మారుస్తూ కూడా చిన్నారావును ఛైర్మన్‌గా, సభ్యులుగా కుంతూరు సింహాచలం, వంజరి సన్యాసినాయుడు నియమితులయ్యారు. చింతపల్లి మండలంలో గతంలో ఉన్న కిముడు సీతారామరాజును మారుస్తూ ఛైర్మన్‌గా మోరి రవి, సభ్యులుగా కించే సీతన్న, కాగి నాగేశ్వరరావును నియమించింది. జీకే వీధి మండలంలో గతంలో ఉన్న వనపరి ప్రసాద్‌ను మారుస్తూ కొత్తగా వంతాల అరుణ్‌కుమార్‌ను ఛైర్మన్‌గా, తుంబేరి కుమారి, పాంగి బాబూరావు సభ్యులుగా నియమితులయ్యారు.

జీడిమామిడి తోట దగ్ధం
- రూ.లక్ష ఆస్తి నష్టం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి శివారు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం పూతిక బాబి అనే రైతుకు చెందిన జీడి మామిడితోటలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పూత, పిందెలతో ఉన్న సుమారు 50 చెట్లు కాలిపోయినట్టు బాధిత రైతులు తెలిపాడు. దీనివల్ల తీవ్రంగా నష్టపోయినట్టు వాపోయాడు. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపాడు.

గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి



గౌరినాయుడు (ఫైల్)

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రానికి చెందిన జి.గౌరి నాయుడు(21) అనే యువకుడు శనివారం రాత్రి ఎస్‌కోట నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. బంగారమ్మపేట సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న కల్వర్టును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతనిని హుటాహుటిన ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అతని మృతితో గుమ్మకోటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

300 మందికి వైద్య పరీక్షలు



రక్తపరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

మారేడుమిల్లి : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కమ్యూనిటీ హాల్ వద్ద అదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి రాజమహేంద్రవరానికి చెందిన వైద్యులు శాంతి దేవి, నిఖిత 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి రక్తం, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.సత్యసాయి సేవ సమితి సభ్యులు యోగేశ్వరరావు, మూర్తి, పుచ్చల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు 148 దరఖాస్తులు

అడ్డతీగల: రంపచోడవరం ఐటీడీఏ, అభి టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు నిర్వహించనున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఇప్పటివరకూ 148 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఉచిత భోజన, వసతి సదుపాయంతో స్థానిక వైటీసీలో 45 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మొదటి బ్యాచ్ అభ్యర్థులకు వారం రోజుల్లో శిక్షణ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.శిక్షణ అనంతరం ఎల్ఎల్ఆర్ ఉచితంగా ఇవ్వబడుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా జిప్‌లైన్ ఏర్పాటు

ఎమ్మెల్యే పాల్గుణకు ఏపీ టూరిజం కాంట్రాక్ట్, డైలీవేజ్ ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల వద్ద జిప్‌లైన్‌ను 1/70 యాక్ట్, పీసా చట్టాన్ని ఉల్లంఘించి ఏర్పాటు చేశారని ఏపీ టూరిజం కాంట్రాక్టు, మెన్‌పవర్, డైలీవేజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.గంగరాజు, ఉపాధ్యక్షుడు బాబూరావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం అరకు ఎమ్మెల్యే పాల్గుణకు ఫిర్యాదు చేశారు. గిరిజన ప్రాంతంలో ఐదవ షెడ్యూల్డ్ ప్రకారం బయట వ్యక్తులకు ఇవ్వకూడదనే నిబంధనలు ఉనప్పటికీ ప్రైవేటు వ్యక్తులకు జిప్‌లైన్ కట్టబెట్టారని వారు పేర్కొన్నారు. బొర్రాగుహలను ఆనుకుని ఉన్న వనసంరక్షణ సమితికి సంబంధించిన 2.3 ఎకరాల భూమిని అటవీశాఖ నుంచి పర్యాటకశాఖ తీసుకుని అడ్వెంచర్ పేరుతో బయటవ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. జిప్‌లైన్‌ను పర్యాటకశాఖ స్వయంగా నిర్వహిస్తే మంచి ఆదాయం వస్తుందని, బయటవ్యక్తుల కారణంగా ఆ శాఖ నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని ఐదు యూనిట్లను ప్రైవేటీకరణ చేయకుండా పర్యాటకశాఖ నిర్వహించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి కృషిచేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏఎస్సార్ జిల్లా కార్యదర్శి అంజలిరావు, గైడ్ యూనియన్ ప్రెసిడెంట్ రాము, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన పదోన్నతి కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకున్న పీవో సూరజ్‌గనోరే, డీడీ అబ్లలోములకు ఎస్‌టీయూ నాయకులు లండా వేణుగోపాల్, బి.కృష్ణ, జి. నాగభూషణం కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విశాఖ : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం జాతరలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల అద్భుతంగా కూచిపూడి నృత్యం చేశారు. జానపద గీతాలకు హుషారుగా నృత్యం చేశారు.

మోక్షిత, లిఖిత, సరళ, పద్మ, అనూహ్య, షన్విక, గామిని, శ్రీనంద, రిషిత, నవ్య, సారిక, సౌజన్య, కుశల నృత్యం చేయగా... మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి కార్యక్రమం పర్యవేక్షించారు.

పసుపు.. దిగుబడి బాగు

- దుంప, కొమ్ము సైజు బాగు
- పెరిగిన పసుపు ధర కిలో రూ.85 నుంచి 100 వరకు



బొండాపల్లిలో పసుపును ఉడికిస్తున్న దృశ్యం



పసుపు కొమ్ముల సేకరణలో గిరిజనులు

పెదబయలు: దేశంలోనే అసోం తరువాత అంతటి ఛాయ పసుపు విశాఖ మన్యంలోనే ఎక్కువగా పండుతుంది. ఇందులో పెదబయలు మండలంలో అత్యధికంగా పసుపు సాగు చేస్తున్నారు. ఏపీలో ఛాయ పసుపుకు కేరాఫ్‌గా విశాఖ ఏజెన్సీ పేరొందింది. పెదబయలు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 1,545 హెక్టార్లలో పసుపు సాగు చేస్తున్నారు. గిరిజన రైతులు రసాయన ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులను ఉపయోగించి మాత్రమే పసుపు సాగు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రతీ ఏడాది జనవరి నెల నుంచి ఏప్రిల్ నెల వరకు సుమారు నాలుగు నెలల ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటేనే పసుపు సేకరిస్తారు. పసుపు, పిప్పళ్ల సేకరణ ఎక్కువ మంది సేకరించాల్సి వస్తోంది. సేకరించిన పసుపును తారుడ్రమ్ములు, ఇతర సిల్వర్ పాత్రల్లో ఉంచి కట్టెల సహాయంతో ఉడికించిన తరువాత ఎండలో ఎండించిన తరువాత రంగు వచ్చేంత వరకు బండరాళ్లపై రుద్దుతారు. అనంతరం పసుపునకు మంచి ఛాయ రంగు వచ్చిన తరువాత వారపు సంత మార్కెట్‌లో తెచ్చి రైతులు విక్రయిస్తారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పసుపు సేకరణ పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమై ఉన్నారు. దీంతో మండలంలో ఉపాధి పనులు ఉన్న ఎక్కువ మంది కూలీలు రావడం లేదు. ఎక్కువ మంది రైతులు పసుపు, పిప్పళ్ల సేకరణ పనిలో నిమగ్నమయ్యారు.

ఆనందంలో రైతులు

ఈ ఏడాది గిరిజన ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా కురువడంతో పసుపు పంటకు అనుకూలంగా ఉంది. దీంతో పసుపు దిగుబడి బాగుంది. వర్షాలు పడకపోతే కొమ్ము, దుంపల సైజు చిన్నదిగా ఉంటుందని, ఈ ఏడాది దుంప, కొమ్ము సైజు బాగుందని రైతులు చెబుతున్నారు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది పసుపు ధర రూ.100 వరకు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం చొరవతో గిట్టుబాటు ధర



గత ఏడాది కిలో పసుపు రూ.55 నుంచి రూ.65 వరకు ధర ఉంటే ఈ ఏడాది కిలో రూ.85 నుంచి రూ.100 వరకు ధర మార్కెట్‌లో ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పిప్పళ్లు మాత్రం కిలో రూ.350 నుంచి రూ.480 వరకు ధర ఉంది. ప్రభుత్వం చొరవతో మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది పిప్పళ్లు, రాజ్‌మా ఇతర పంటలకు కూడా మంచి ధర ఉంది.

– పోయిభ బాలయ్యదొర, రైతు, కొకవంగి గ్రామం, పెదబయలు మండలం

దిగుబడి బాగుంది



ఈ ఏడాది మండలంలో పసుపు దిగుబడి బాగుంది. వర్షాలు ఎక్కువగా కురుడంతో కొమ్ము, దుంప సైజు పెద్దదిగా ఉంది. దీంతో దిగుబడి వస్తుంది. అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది వారపు సంత మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. ఈ పంట కేవలం వర్షాధారంపై ఆధారపడి రైతులు పండిస్తారు. వర్షపాతం తక్కువగా ఉంటే దిగుబడి రాదు. దీనికి తోడుగా సేంద్రియ ఎరువులనే రైతులు ఉపయోగిస్తున్నారు. గత ఏడాది కంటే పసుపు సాగు విస్తీర్ణం పెరగింది. అలాగే పసుపు ఉడకబెట్టడానికి కొన్ని గ్రామాల్లో డ్రమ్ములు పంపిణీ చేశాం.

– ఏ శ్రీనివాస్, ఏవో, పెదబయలు

విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

సందడిగా గుడిస హిల్‌టాప్



గుడిసలో పర్యాటకులు



జలతరంగిణి జలపాతం వద్ద సందర్శకుల తాకిడి



మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



చాపరాయి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు

మారేడుమిల్లి : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన గుడిస హిల్ టాప్ సందర్శనకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబ సమేతంగా తరలిరావడంతో సందడి నెలకొంది. శనివారం రాత్రి ఇక్కడికి చేరుకున్న వీరు మారేడుమిల్లిలోని అతిథిగృహాల్లో బసచేశారు. తెల్లవారు జామున గుడిసలోని సూర్యోదయం అందాలు తిలకించేందుకు వెళ్లారు. వనవీహారి, జలతరంగిణి, అమృతధార జలపాతాలు, జంగిల్ స్టార్, వ్యూ పాయింట్స్ ప్రాంతాల్లో రద్దీ నెలకొంది.

చెరువులవేనంకు..

చింతపల్లి రూరల్: మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన లంబసింగి చెరువులవేనంకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మంచు అందాలను తిలకించారు.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ సందడి చేశారు.

7న పంటల జీవవైవిధ్య ప్రదర్శన

అడ్డతీగల: అంతరించి పోతున్న సంప్రదాయ పంటల పునరుద్ధరణ కార్యాచరణలో భాగంగా ఈనెల 7 న పంటల జీవ వైవిద్య ప్రదర్శన (ఆర్గానిక్ మేళా) నిర్వహించనున్నట్టు లయ సంస్థ సహజ వనరుల యాజమాన్య విభాగ యూనిట్ మేనేజర్ కె.కోటేశ్వరరావు, కో–ఆర్డినేటర్ బుర్రే చక్రబాబు తెలిపారు. వై.రామవరం మండలం గుమ్మరిపాలెంలోని లయ స్వచ్ఛంద సంస్థ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో గిరిజన రైతులతో కలిసి ఈ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా విత్తనాలు, చిరుధాన్యాలు, పప్పు ధినుసులు, నూనె గింజలు, అడవుల్లో లభించే దుంపలు ప్రదర్శనలో ఉంచుతామన్నారు. తెల్ల కందులు, మినుములు, పెసలు, బొబ్బర్లు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, కర్రపెండలం, చిలగడ దుంపలు తదితరలు అంతరించిపోతున్నట్టు చెప్పారు. పూర్వం వాటి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండేదన్నారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణమే లేకుండా పోయిందని చెప్పారు. చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పు ధినసులు పండించే గిరిజన రైతాంగం విజయగాథలను రైతులకు వినిపించి సాగు విస్తీర్ణం పెంచడానికి విత్తనాలు అందుభాటులోనికి తీసుకొచ్చే ప్రక్రియను సంస్థ ద్వారా చేపడతామన్నారు. ఆయా పంటలు పండించే రైతులు వెంట తీసుకొచ్చిన విత్తనాలను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. గిరిజన రైతులు విస్తృతంగా ఈ మేళాలో పాల్గొని జీవ వైవిద్యాన్ని కాపాడడానికి సంప్రదాయక పంటల సాగుకి ముందుకు రావాలని కోరారు.

రేపు చింతపల్లిలో ఉద్యోగ ఇంటర్వ్యూలు



మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ



యువతతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్ కుమార్

కొయ్యూరు: గిరిజన మహిళలు ఈ నెల 6న చింతపల్లి యువకుల శిక్షణ కేంద్రం(వైటీసీ)లో నిర్వహిస్తున్న ప్రేరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ పి.వెంకటరమణ కోరారు.ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టాటా ఎలక్ట్రానిక్ కంపెనీ నిర్వహిస్తున్న సంస్థలో మూడు వేల వరకు ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలకు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళలు ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని సూచించారు. ఎంపికైన మహిళలకు కర్నాటక రాష్ట్రంలో హొసూర్‌లో ఉపాధి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.20 వేలతో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు.అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440904218, 9440904241, 9440904217 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

యువతకు అవగాహన

కొయ్యూరు సంతలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువతీ యువకులకు మంప ఎస్‌ఐ లోకేష్ కుమార్ ఆదివారం పోలీసు శాఖ ప్రేరణ కార్యక్రమం ద్వారా కల్పిస్తున్న ఉద్యోగాల ప్రాధాన్యతను వివరించారు. ఇందులో భాగంగా చింతపల్లిలో ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు అర్హులైన యువతులు తరలివెళ్లాలని సూచించారు. ఆటోలో విస్తృత ప్రచారం చేశారు.

నిందితుల కోసం ముమ్మర గాలింపు

- తహసీల్దార్ హత్య కేసులో ఇద్దర్ని విచారించిన పోలీసులు
- బెంగళూరు వెళ్లిన రెండు బృందాలు

పీఎంపాలెం: నగరంలో సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్యకేసు నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్య చేసిన తరువాత నిందితుడి విమానంలో బెంగళూరు వెళ్లినట్టు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో రెండు పోలీసు బృందాలను అక్కడకు పంపినట్టు తెలిసింది. హత్యా సంఘటనలో ప్రమేయం ఉన్నట్టు భావిస్తున్న మధురవాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు అర్చకులను ఇప్పటికే పోలీసులు విచారించారు. హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే నిందితుల కోసం పది పోలీసు బృందాలు గాలిస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- వణికిస్తున్న చలిగాలులు
- దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లావ్యాప్తంగా చలిగాలులు విజృంభిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలితీవ్రత పెరిగింది. ఉదయం వేళల్లో పొగమంచు దట్టంగా కుంటోంది. పాడేరు మండలం మినుములూరు కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీలు, చింతపల్లి పరిశోధనస్థానంలో 13.5 డిగ్రీలు, అరకులోయ కాఫీ బోర్డు వద్ద 14.3 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



పోటెత్తిన ఫ్యాన్స్



విశాఖ స్పోర్ట్స్: మ్యాచ్ ఫార్మాట్ ఏదైనా విశాఖలో జరిగితే.. అది సూపర్‌హిట్టే.! అభిమానుల నుంచి ఆ స్థాయి ఆదరణ ఉంటుంది. భారత్, ఇంగ్లండ్ రెండో మ్యాచ్‌లో భాగంగా ఆదివారం స్టేడియంకు పోటెత్తిన అభిమానులను చూసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ సైతం ఆశ్చర్యపోయారు. టెస్ట్‌లకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. భారత ఆటగాళ్లు రాణిస్తుండటం.. పైగా ఆదివారం కావడంతో స్టేడియంలోని ప్రతి స్టాండ్ నిండిపోయింది. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జయహో భారత్ నినాదాలతో మార్మోగింది. వన్డేలను కాదని టీ–20లకు ఆదరణ పెరిగిన ఈ తరుణంలో.. ఐదు రోజుల పాటు సాగి.. ఒక్కో సారి ఎటువంటి ఫలితం తేలని టెస్ట్‌ల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితుల్లో విశాఖ వేదికగా జరుగుతున్న భారత్–ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఏకంగా 15 వేల మంది టికెట్లను కొనుగోలు చేసి మరీ వీక్షిస్తున్నారు. ఏసీఏ కేవలం రెండు వేల మంది విద్యార్థులను మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామని చెప్పినా... విద్యార్థుల తాకిడి పెరగడంతో వారిని నిరాశ పరచకుండా ఆదివారం దాదాపు 7 వేల మందికి ప్రవేశం కల్పించింది. వీరంతా స్టేడియంలోని బీ, సీ, కే స్టాండ్స్‌లో కూర్చొని కేరింతలు కొట్టారు. ఔత్సాహిక క్రికెటర్లను దక్షిణ లోయర్ టైర్ సీ స్టాండ్‌లోకి అనుమతించారు. బాల్ రిట్రైవర్లుగా జోన్ జట్లకు ఆడే ఆటగాళ్లను అనుమతించడం పరిపాటి. అయితే ఆదివారం జరిగిన ఇన్నింగ్స్‌లో జోన్, జోనల్ స్థాయికి ఆడుతున్న అమ్మాయిలను బాల్ రిట్రైవర్లుగా.. ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అనుమతించారు. ఇది మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



బాల్ రిట్రైవర్లు



ప్రేక్షకుల కోలాహలం

నాన్నకు ప్రేమతో..



శుభ్‌మన్ గిల్

విశాఖ స్పోర్ట్స్: నాన్న అను రెండు అక్షరాలు మరుపురాని మధుర క్షణాలు. ప్రతి ఒక్కరికి మొదటి హీరో తండ్రే. ఆ తండ్రి ముందు ఏదైనా విషయం సాధిస్తే.. అతని ఆనందానికి అవధులు ఉండవు. ఇలాంటి దృశ్యమే ఆవిష్కృతమైంది వైఎస్సార్ స్టేడియంలో.. టెస్ట్‌లో ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్ ఆదివారం వైఎస్సార్ స్టేడియంలో చెలరేగిపోయాడు. మూడో టెస్ట్‌కు జట్టులో ఉంటాడా లేదా అనే సంశయం నెలకొనగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా సెంచరీ చేశాడు. మూడో రోజు ఆటలో తనకంటే ముందు ఓపెనర్లు ఇద్దరూ కేవలం రెండు పరుగుల వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరగా.. ఆ స్థానంలో వచ్చిన గిల్ ఆచితూచి ఆడాడు. రెండు భారీ భాగస్వామ్యాలతో నిలకడగా రాణించి సెంచరీని నమోదు చేశాడు. గిల్ తండ్రి లఖ్విందర్ సింగ్ స్టేడియంలో కూర్చొని కుమారుడి ఆటను పూర్తిగా ఆస్వాదించగా.. సెంచరీ పూర్తి చేసినప్పుడు తండ్రి వైపు చూసి గిల్ అభివాదం చేశాడు. ఇదే విషయాన్ని వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రశ్నించగా గిల్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. అయితే భారత్ చివరి ఐదు వికెట్లను కేవలం 44 పరుగులకే కోల్పోవడం అభిమానులను కాస్త నిరాశ పరిచింది. స్థానిక కుర్రాడు భరత్ సైతం రెండు ఇన్నింగ్స్‌లోనూ అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో భరత్ అందుకున్న క్యాచ్ మాత్రం అద్భుతం.

ఇంటర్ ఫీజుకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్‌ఐవో పి. మురళీధర్, డీవీఈవో బి.రాధ తెలిపారు. మార్చి నెలలో జరిగే పరీక్షలకు తత్కాల్ పద్ధతిన రూ.3 వేలు ఫీజు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు చెల్లించవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ చదువుతూ, ఫీజు సకాలంలో చెల్లించలేని వారికి ఇదో గొప్ప అవకాశం అన్నారు. అదే విధంగా గతంలో తప్పిన విద్యార్థులు కూడా తత్కాల్ ద్వారా ఫీజు చెల్లించి, కోర్సు ఉత్తీర్ణులు కావచ్చన్నారు. ఇదే చివరి అవకాశమని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న సంజయ్‌కుమార్



సంజయ్ కుమార్‌కి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

గిరిజనుల అభ్యున్నతికి విశేష కృషి



పుస్తకావిష్కరణ చేస్తున్న అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ ప్రతినిధి పి.సోమయాజులు, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి, రాజమాత మాయాంక్ కుమారిదేవ్

- వారిది వనవాసీ సంస్కృతి
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభలో వక్తులు

బీచ్ రోడ్డు: గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభను బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్చువల్ విధానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆదివాసీలది వనవాసీ సంస్కృతి అని, ఇటువంటి యాత్రల ద్వారా అది నేటి తరానికి తెలుస్తుందన్నారు. గిరిజనులు తమ తెగ కట్టుబాట్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు.

ప్రకృతి ఆరాధకులు

అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ మార్గనిర్దేశకుడు పి.సోమయాజులు మాట్లాడుతూ గిరిజనులు ప్రకృతి ఆరాధకులు, పర్యావరణ పరిరక్షకులన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వివిధ భాషల కారణంగా చదవుకు దూరం అవుతున్నారన్నారు. విద్యతోనే దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవుతారన్నారు. జనవరి 25న జైపూర్‌లో ప్రారంభమైన తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిక యాత్ర 20 ప్రాంతాల్లో సభలను నిర్వహించి ఈ నెల 4న విశాఖకు చేరుకుంది. ఈ సందర్భంగా తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిపై రచించిన పుస్తకాన్ని, జైపూర్ రాజమాత మాయాంక్ కుమారి దేవ్, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ అధ్యక్షుడు గోపీనాథ్, ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, నాగు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.